మారుతీనగర్ కార్యవర్గం ఎన్నిక



మారుతీ నగర్ నూతన కార్యవర్గం

మణికొండ: కాలనీ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు పూర్తి స్థాయిలో కృషి చేస్తామని మారుతీనగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడు ఐ.లక్ష్మణ్ రావు అన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని మారుతీనగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం మాజీ అధ్యక్షుడు మల్లారెడ్డి సారథ్యంలో ఎన్నుకున్నారు. కమిటీ ఉపాధ్యక్షులుగా రతన్‌రెడ్డి, ఎ.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఎస్. గంగాధర్‌రావు, సహాయ కార్యదర్శులుగా డి.సాగర్, కె.మమత, కోశాధికారిగా ఎం. రామకృష్ణ, కార్యవర్గ సభ్యులుగా కె. మల్లారెడ్డి, కె. నర్సింగ్‌రావు, వి. శ్రీకారిని, ఎస్. నాగభూషణం, కేఆర్ స్వామి, ఎస్. నరేష్, ఇజ్రాయిల్, కె. లక్ష్మన్‌రావు, రామకృష్ణారెడ్డి, పలనిస్వామి, బి.రాంబాబు, బి. సత్యనారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ రాబోయే రెండేళ్లు కాలనీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ప్రజలందరికీ ఉపయోగపడే పార్కును మున్సిపాలిటీ అధికారులు వెంటనే అభివృద్ధి చేయాలన్నారు.

రోడ్లపై కార్లు పార్క్ చేయొద్దు



కేపీఆర్ కాలనీలో అవగాహన కల్పిస్తున్న నాయకులు

మణికొండ: కాలనీ రోడ్లపై కార్లు నిలపడంతో వాటర్ ట్యాంకర్లు, అంబులెన్స్‌ల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దీనిని అర్థం చేసుకుని కార్ల యజమానులు వాటిని గృహాల్లోపల, ఖాళీ స్థలాల్లో నిలుపుకోవాలని కేపీఆర్ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు అన్నారు. ఈ మేరకు ఆదివారం కాలనీలో ర్యాలీ నిర్వహించారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో పలు కాలనీల్లో రహదారులు ఇరుగ్గా ఉన్నాయని, వాటిని మరింత ఇరుకు చేసేలా వాటిపై ఎక్కడ పడితే అక్కడ కార్లను నిలుపుతున్నారని మాజీ కౌన్సిలర్ కె. రామకృష్ణారెడ్డి అన్నారు. వాటర్ ట్యాంకర్లు కార్లు అడ్డుగా ఉంటాయని రావటం లేదన్నారు. దీంతో కాలనీ వాసులు నీటి కోసం ఇబ్బందులు పడుతునానరన్నారు. అత్యవసర సమయంలో అంబులెన్స్‌లు వచ్చేందుకు వీలు కావటం లేదన్నారు. ఇకనైనా కేపీఆర్ కాలనీతో పాటు ఇతర కాలనీల్లోనూ రోడ్లపై కార్లను నిలపవద్దని కోరారు. రాబోయే రోజుల్లో ఆయా కార్లను ట్రాఫిక్ పోలీసులను పిలిచి అప్పగించాలని కాలనీ సంక్షేమ సంఘం నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గంగాధర్, ప్రధాన కార్యదర్శి జి. సింహారాజరెడ్డి, నాయులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రవికాంత్‌రెడ్డి, గణేష్‌రెడ్డి, సురేష్, దినేష్‌రెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జవహర్ బాల్‌మంచ్ రాష్ట్రస్థాయి సదస్సు

గచ్చిబౌలి: జవహర్ బాల్‌మంచ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి రిషికేష్‌రెడ్డి అధ్యక్షతన జవహర్ బాల్ మంచ్ రాష్ట్రస్థాయి పిల్లల శిక్షణా సదస్సును గచ్చిబౌలిలోని ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించారు. జవహర్ బాల్‌మంచ్ రాష్ట్ర కో ఆర్డినేటర్, ప్రోగ్రామ్ కన్వీనర్ జిట్టా సునీల్‌కుమార్ యాదవ్ సమక్షంలో ఈ కార్యక్రమం కొనసాగింది. ఈ సదస్సును జవహర్ బాల్ మంచ్ జాతీయ అధ్యక్షుడు జివి హరి, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, మంచ్ జాతీయ ప్రతినిధి, రాష్ట్ర ఇన్‌చార్జీ ఫెన్ రొస్సెల్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సదస్సులో మొట్టమొదటి జవహర్‌బాల్ మంచ్ ఎన్నికలు నిర్వహించి జాబితాను ప్రకటించారు. పిల్లల కమిటీ అధ్యక్షుడు సంతోష్, ఉపాధ్యక్షులు పునీత్, అంబటి సుచరితను ఎన్నుకున్నారు. ఈ సదస్సులో ముఖ్యంగా రాజ్యాంగం వాటి లక్ష్యాలు, ఆశయాలు, స్ఫూర్తిని, పంచాయతీరాజ్ వ్యవస్థ, స్థానిక సంస్థలు, పర్సనాలిటీ, స్కిల్ డెవలప్‌మెంట్ తదితర అంశాలపై పిల్లలకు అవగాహన కల్పించేందుకు ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంచ్ రాష్ట్ర అధ్యక్షుడు రిషికేష్‌రెడ్డి మాట్లాడుతూ జవహర్ మంచ్‌బాల్ మంచి పిల్లల యొక్క లక్ష్యాన్ని చేరుకోవడానికి ఒక సంధానకర్త పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లాల నుంచి తిలిలి యూనిట్‌లోని పిల్లలు 200 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కోఆర్డినేటర్లు శివరాజ్, ప్రవీణ్‌బాబు, కిరణ్, అంబటి తులసి, రాంబాయి, అభిషేక్, సాయికృష్ణ, బాల్యానాయక్, సైదేశ్వరరావు, సుదర్శన్, సునీల్, విదుర్‌చావ్లా, వెంకటేష్ పాల్గొన్నారు.

ఉగ్రవాదంపై నిరసనల వెల్లువ

- పలు ప్రాంతాల్లో నిరసన ప్రదర్శనలు
- ఉగ్రవాదులకు బుద్ధి చెప్పాలి
- దేశంలోకి రాకుండా చేయాలి
- పీఓకేను స్వాధీనం చేసుకోవాలని నినాదాలు



గండిపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద అమరులకు నివాళులర్పిస్తున్న ప్రజలు

మణికొండ: అమాయక పర్యాటకులపై కాల్పులు జరిపి 26మంది ప్రాణాలను బలిగొన్న ఉగ్రవాదులకు కేంద్ర ప్రభుత్వం తగిన బుద్ధి చెప్పాలని మణికొండ మున్సిపల్ మాజీ చైర్మన్ కె. నరేందర్ ముదిరాజ్, నార్సింగి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్, గండిపేట మాజీ సర్పంచ్ అశోక్ అన్నారు. ఉగ్ర దాడులలో మృతి చెందిన వారికి నివాళులు అర్పించేందుకు అలకాపూర్ టౌన్‌షిప్ ఫేజ్–2 పార్కు, నార్సింగి గ్రామం, గండిపేట గ్రామాల్లో ఆదివారం ప్రజలు పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్న వారు మాట్లాడుతూ మన దేశం వైపు చూడాలంటేనే ఉగ్రవాదులు బయపడే పరిస్థితి తీసుకురావాలన్నారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను స్వాధీనం చేసుకుంటే రాబోయే రోజుల్లో ఇలాంటి సంఘటనలు జరిగే అవకాశం ఉండదన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మన దేశానికి మద్దతు వస్తున్న తరుణంలో పీఓకేను స్వాధీనం చేసుకుని ముష్కరులకు బుద్ధి చెప్పాలన్నారు. కాశ్మీర్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేసి స్థానికులకు ఉపాధి అవకాశాలను కల్పించి వారి జీవన ప్రమాణాల్లో మార్పులు తెస్తున్న తరుణంలో ఇలాంటి దాడులు వారికి తినటానికి తిండి లేకుండా చేస్తాయన్నారు. ఆయా కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఉగ్రదాడికి నిరసనగా శాంతి ర్యాలీ

బండ్లగూడ: పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ ఆల్ కాలనీస్ ఫెడరేషన్ బీజేఎంసీ ఆధ్వర్యంలో ఆదివారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పహల్గాం ఉగ్రవాద దాడులను ఖండిస్తూ మతాలకు అతీతంగా శాంతి ర్యాలీ చేపట్టారు. సన్ సిటీలోని ఆర్మీ పబ్లిక్ స్కూల్ నుంచి బండ్లగూడ జాగీరులోని పార్మయిష్ హోటల్ దగ్గర ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. కాలనీ వాసులు శాంతి, ఐక్యతకు మద్దతు ఇస్తూ సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అడ్వైజర్ సుధాకర్, ప్రెసిడెంట్ వినయ్‌రెడ్డి, వైజ్ ప్రెసిడెంట్ నదీమ్, జనరల్ సెక్రటరీ నరేందర్‌బాబు, ప్రమీల, వంశీ, రాధాకృష్ణ, వివిధ కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



నార్సింగిలో కొవ్వొత్తుల ర్యాలీ



శాంతి ర్యాలీలో పాల్గొన్న ఆల్ కాలనీస్ ఫెడరేషన్ సభ్యులు

వరి పరిశోధన కేంద్రం వార్షిక సమావేశం



సమావేశంలో పాల్గొన్న అధికారులు, శాస్త్రవేత్తలు

ఏజీవర్సిటీ: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్(ఐసీఎఆర్) ఇండియాన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్(ఐఐఆర్ఆర్) వరి పరిశోధన, వరిపై ఆల్ ఇండియా కోఆర్డినేటెడ్ రీసెర్చ్ ప్రాజెక్ట్ వార్షిక సమావేశం ఆదివారం రాజేంద్రనగర్‌లో ప్రారంభమైంది. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ కార్యక్రమాన్ని ఐసీఎఆర్ డీజీ పరోడా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ జానయ్య మాట్లాడుతూ తెలంగాణలో వరి పరిశోధన 1928లో నిజాం పాలనలోనే ప్రారంభమైందని, హిమాయత్‌సాగర్ డ్యామ్ నిర్మాణంతో రైతులు వరి సాగు చేపట్టినట్లు తెలిపారు. నేడు తెలంగాణ దేశంలోనే మిగులు బియ్యం ఉత్పత్తి చేసే రాష్ట్రంగా ఉందన్నారు.ఐసీఎఆర్ డీటీ డీకే యాదవ్ మాట్లాడుతూ 1996 విత్తన చట్టం అమలులోకి వచ్చినప్పటి నుంచి దేశంలో 1500 వరి రకాలను విడుదల చేసినట్లు తెలిపారు.

విద్యార్థులకు సత్కారం



విద్యార్థులను అభినందిస్తున్న విజ్ఞాన్ కళాశాలల చైర్మన్ గౌరీ సతీష్

బండ్లగూడ: ఉన్నత విద్యతో బంగారు భవిష్యత్తు సాధ్యమని విజ్ఞాన్ కళాశాలల చైర్మన్ గౌరీ సతీష్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని విజ్ఞాన్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో జి.మానిక(986), ఎంఈసీలో జి.పి.సి.రెడ్డి(984), సీఈసీలో ఎల్. వాత్సల్య(970), బైపీసీలో పి.కామాక్షి(961), తేజశ్రీ(959), ఉజ్మసుల్తాన(955), బి.హసిని(955), కమాల్వేరి(952), శిఫాబేగం (950), మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రభంజనం సృష్టించారు. మొదటి సంవత్సరంలో మోహతుద్దీన్(447), సార్థక్(444), ఎండి.షరిఫ్(441), సీఈసీలో జి.శివాని(479), ముస్కాన్ బేగం(462), నూస్‌రాత్‌బేగం(455), జి.లోకేష్(444)లో ఉత్తమ మార్కులు సాధించి విద్యార్థులు ఉత్తమ ప్రతిభను సాధించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను గౌరీసతీష్ అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒత్తిడి లేకుండా విద్యార్థులు చదివినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధించగలరన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులు విద్యను అందించడమే ఇందుకు కారణమన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టీఆర్ఎస్ఎంఏ ప్రధాన కార్యదర్శిగా వెంకటరమణ



టీఆర్ఎస్ఎంఏ జిల్లా నూతన కార్యవర్గం

శంషాబాద్: తెలంగాణ గుర్తింపు పొందిన ప్రైవేట్‌స్కూల్స్ యాజమాన్య సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శంషాబాద్ పట్టణంలోని కృష్ణవేణి స్కూల్ యజమాని వెంకటరమణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా నియమితులైన గాయం బీష్మారెడ్డితో పాటు కోశాధికారిగా ఎన్నికైన రఫీకి ఆయన అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రైవేటు స్కూళ్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం నూతన సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఎన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె. అనిల్‌కుమార్, కోశాధికారి శ్రీకాంత్‌రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ కె. రామేశ్వర్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఎ. యాదగిరి పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో సంతృప్తి



వాసవీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయం వద్ద అన్నదానం చేస్తున్న దృశ్యం

మణికొండ: మనకు ఉన్నదాంట్లో కొంత లేని వారికి పెట్టడం, ఆకలితో ఉన్న వారికి భోజనం పెట్టడం ఎంతో సంతృప్తినిస్తాయని మణికొండ మాజీ సర్పంచ్ యాలాల నరేష్, వాసవీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదగిరి అన్నారు. ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని మణికొండ శివాజీనగర్ పోచమ్మ దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. అలకాపూర్ టౌన్‌షిప్‌లోని వాసవీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయం వద్ద అన్నదానం, మజ్జిగ పంపిణీ కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి అమావాస్యకు పేదలకు అన్నదానం చేయాలని నిర్ణయించి క్రమం తప్పకుండా కొనసాగిస్తున్నామన్నారు. ఇలాంటి కార్యక్రమాలు పేదల కడుపు నింపుతున్నాయన్నారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు కె. రమేష్, వై. కుమా, వై. రాజు, శేఖర్, కె. శ్రీనివాస్, డి. రాజు, డి. హరీష్, వై. జంగయ్య, వై. శ్రీధర్, వై. కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎంలో చోరీకి యత్నం

శంషాబాద్: ఏటీఎంలో చోరీకి యత్నించిన సంఘటన చోటు శంషాబాద్ పట్టణంలో చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. స్థానిక బస్టాండ్ ఎదురుగా జాతీయరహదారి పక్కన ఉన్న సౌండి ఇండియా ఏటీఎం కేంద్రంలోకి ప్రవేశించిన హెల్మెట్ ధరించి వ్యక్తి ముందుగా అక్కడ సీసీ కెమెరాల వైర్లు తొలగించాడు. మరి కొన్ని వైర్లు కత్తిరిస్తుండగా అలారం మోగడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఆర్‌జీఐఏ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెట్ల కొమ్మలను తొలగించండి



ఫుట్‌పాత్‌పై పెరిగిన చెట్ల కొమ్మలు

రాజేంద్రనగర్: ఫుట్‌పాత్‌పై నడిచేందుకు వీలు లేకుండా పెరిగిన చెట్టు కొమ్మలను తొలగించాలని రాజేంద్రనగర్ సర్కిల్ పాదచారులు జీహెచ్ఎంసీ అధికారులను కోరుతున్నారు. రాజేంద్రనగర్ పీడీపీ చౌరస్తా నుంచి హిమాయత్‌సాగర్ వరకు గతంలో రేడియల్ రోడ్డును ఏర్పాటు చేశారు. ఈ రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్ నిర్మించారు. ఈ ఫుట్‌పాత్‌పై ప్రతిరోజు స్థానికులు, పాదచారులు రాకపోకలు సాగిస్తుంటారు. గతంలో జీహెచ్ఎంసీ ఈ ఫుట్‌పాత్ పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో మొక్కలను నాటింది. ఈ మొక్కలతో పాటు ప్రస్తుతం పిచ్చి మొక్కలు పెరిగి ఫుట్‌పాత్‌లను ముంచెత్తాయి. దీంతో పాదచారులు సైతం నడిచేందుకు వీలు లేకుండా చెట్ల కొమ్మలు అడ్డుగా పెరిగాయి. అడ్డుగా పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

కంప్యూటర్ శిక్షణ అవసరం



దరఖాస్తులను స్వీకరిస్తున్న క్లబ్ సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరికీ కంప్యూటర్ శిక్షణ అవసరమని నవయువ యూత్ క్లబ్ అధ్యక్షులు ఏర్వ కుమారస్వామి అన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో మే 1 నుంచి 30 ప్రతి ఆదివారం నిర్వహించనున్న ఉచిత కంప్యూటర్ శిక్షణ శిబిరానికి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి కంప్యూటర్ పరిజ్ఞానం అందించాలన్నదే తమ లక్ష్యమన్నారు. కంప్యూటర్ యుగంలో ప్రతి ఒక్కరికీ కనీస సాంకేతిక పరిజ్ఞానం అవసరమన్నారు. ఈ నేపథ్యంలోనే ఉచిత శిక్షణా శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ శిక్షణలో బేసిక్ కంప్యూటర్ అవగాహన, టైపింగ్, రైటింగ్ స్కిల్స్, సీ లాంగ్వేజ్ తదితర అంశాలను నేర్పించనున్నామన్నారు. ప్రాక్టికల్ శిక్షణతో పాటు ప్రతి శిక్షణార్థులకు తగిన మార్గదర్శకత్వం అందిస్తామన్నారు. అవసరమైన వారు ముందుగానే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షులు రమేష్‌రెడ్డి, సాంస్కృతిక కార్యదర్శి గొంత్యాల శ్రీనివాస్, మానవ సేవే మాధవ సేవా డైరెక్టర్ హేమలత, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడలపై ఆసక్తి చూపాలి



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న వీసీ

ఏజీవర్సిటీ: విద్యార్థులు ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడలో నైపుణ్యం సాధించాలని కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ దండా రాజిరెడ్డి అన్నారు. అయోధ్యలో మే 2 నుంచి 5 వరకు 22వ అఖిల భారత అంతర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ క్రీడా పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో ఉద్యాన విశ్వవిద్యాలయం తరపున 40 మంది క్రీడాకారులు పాల్గొననున్నారు. క్రీడాకారుల బృందం బస్సును వీసీ ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రోజు కొద్ది సమయాన్ని క్రీడలకు కేటాయించాలని, క్రీడల్లో గెలుపు ఓటములు సమానంగా స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో వర్సిటీ విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ చీనా నాయక్, రిజిస్ట్రార్ భగవాన్, ప్రశాంత్, పిడగం సైదయ్య, వెంకటలక్ష్మి, విద్యార్థులు ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

ఇంటర్ టాపర్లకు అభినందనలు



టాపర్‌లను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, ముద్దం శ్రీనివాస్, డైరెక్టర్ శ్రీనివాస్

రాజేంద్రనగర్: ఇంటర్మీడియట్ ఫలితాల్లో శ్రీష్టవి విద్యార్థులు మార్కుల ప్రభంజనం సృష్టించారు. ఎంపీసీ రెండో సంవత్సరంలో ఎస్పితా ప్రియ దర్శిని 1000 మార్కులకు గాను 995 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. బైపీసీలో విద్యా కుంబర్ 990 మార్కులు సాధించగా... జూనియర్ ఇంటర్ ఫలితాల్లో ఎంపీసీలో శ్రీరాజ్ 470 మార్కులకు గాను 467 మార్కులు, బైపీసీలో కె.ప్రియాంక 440 మార్కులకు గాను 435 మార్కులు, ఎంఈసీలో నిమ్రా, జి.భరత్‌లు 500 మార్కులకు గాను 491 మార్కులు సాధించి రాజేంద్రనగర్ జోన్‌లో టాపర్లుగా నిలిచారు. సీఈసీలో లెకికా 500 మార్కులకు గాను 485 మార్కులు సాధించింది. ఘన విజయం సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్, కరస్పాంటెండెంట్ ముద్దం శ్రీనివాస్, కళాశాల డైరెక్టర్ శ్రీనివాస్ అభినందించారు.

వరంగల్‌కు తరలిన గులాబీ దండు





మణికొండ: బీఆర్ఎస్ రజతోత్సవ సభను ఆదివారం వరంగల్‌లో నిర్వహించడంతో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెల్లారు. బీఆర్ఎస్ మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల అధ్యక్షులు డి.సీతారాం, కె. విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంచిరేవుల, నార్సింగి, మణికొండ, పుప్పాలగూడ, నెక్నాంపూర్, వట్టినాగులపల్లి, ఖానాపూర్ తదితర గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పి. కార్తీక్ రెడ్డి ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనాల్లో వారంతా వరంగల్‌కు బయలు దేరారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ రాష్ట్రంలో ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసిగి పోయారన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవటంతో ప్రజలు ఆగ్రహంగా ఉన్నారన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకు వారు సిద్ధంగా ఉన్నారన్నారు. వరంగల్ సభకు తరలివెల్లిన వారిలో నార్సింగి మున్సిపాలిటీ నాయకులు మహబూబ్, ఆనంద్, సలీం, గణేష్ ముదిరాజ్, శ్రీకాంత్‌రెడ్డి, విష్ణువర్ధన్, నరసింహ, మల్లేష్, జితేందర్, ముత్యాలు, మణికొండ మున్సిపాలిటీ నుంచి జి. నరేందర్, కె. ధన్‌రాజ్, జి.విఠల్, ఎ.లక్ష్మణ్‌రావు, పి. రూపారెడ్డి తదితరులు ఉన్నారు.

తైక్వాండో విజేతలకు సత్కారం



విజేతకు పతకాన్ని అందజేస్తున్న చినజీయర్‌స్వామి

శంషాబాద్ రూరల్: మండల పరిధిలోని జీవా ప్రాంగణంలో ఆదివారం జిల్లా తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో పివీ, సబ్–జూనియర్, క్యాడెట్, జూనియర్, సీనియర్ విభాగాల్లో ఈ పోటీలు జరిగాయి. విజేతలకు చినజీయర్ స్వామి పతకాలు అందజేశారు. కార్యక్రమంలో మైహోం గ్రూప్ అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు, అహోబిల జీయర్ స్వామి, దేవనాథ జీయర్‌స్వామి, పాల్గొన్నారు.

తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్

రాజేంద్రనగర్: తెలంగాణలో త్వరలోనే గుజరాత్ తరహాలో డబుల్ ఇంజన్ సర్కార్ రాబోతుందని అందుకు అనుగుణంగా బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ ఓబీసీ అధ్యక్షులు డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. ఆదివారం ఆయన రాజేంద్రనగర్ శివరాంపల్లి ప్రజా భవన్‌లో నిర్వహించిన మన్ కీ బాత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ... కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్ఎస్ ఒకే గూటి పక్షులన్నారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో మజ్లీస్ పార్టీ అభ్యర్థికి కాంగ్రెస్ మద్దతు ఇచ్చిందని... అలాగే బీఆర్ఎస్ ఓటింగ్ దూరంగా ఉంటూ మజ్లీస్‌కు అనుకూలంగా వ్యవహరించిందని ఆరోపించారు. సభలతో బీఆర్ఎస్ ప్రజలకు చేసేది ఏం లేదన్నారు. రూ. లక్ష కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేసిన బీఆర్ఎస్‌ను ప్రజలు నమ్మరన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన అనంతరం పదేళ్లల్లో రూ. 8 లక్షల కోట్ల అప్పు చేసి బీఆర్ఎస్ ప్రజలను ముంచిందన్నారు. కాంగ్రెస్‌కు నమ్మి ఓటు వేస్తే నట్టేట ముంచిందన్నారు. ప్రజలు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను నమ్మరన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం కాశ్మీర్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఆర్టికల్ 370 రద్దు అనంతరం కనీవినీ ఎరగని రీతిలో అభివృద్ధి చేసిందన్నారు. ప్రపంచంలోనే ఎత్తైన వంతెనను నిర్మించిందని గుర్తు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 2 కోట్ల 30 లక్షల మంది కాశ్మీర్‌ను సందర్శించారని గుర్తు చేశారు. పహల్గాం దాడిని ప్రతి భారతీయుడు ఖండిస్తున్నారని... తగిన గుణపాఠం తప్పదన్నారు. నిరుపేద ముస్లింల అభివృద్ధి కోసం వక్ఫ్ బోర్డు చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. కొందరి చేతుల్లో వక్ఫ్ బోర్డు భూములు ఉండటంతో వాటి ప్రతిఫలాన్ని అనుభవిస్తున్నారన్నారు. వక్ఫ్‌బోర్డు చట్టం ద్వారా నిరుపేద ముస్లింలందరికి లబ్ధి చేకూరడం ఖాయమన్నారు. బీజేపీ ప్రభుత్వం ముస్లింలకు వ్యతిరేకం కాదని... తీవ్రవాదానికి, దేశ ద్రోహులకు వ్యతిరేకమన్నారు. ఇదే విషయాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు ముస్లిం సోదరులకు వివరించాలన్నారు.